క్లుప్తంగా

వాడచీపురుపల్లి పది టాపర్లకు సత్కారం



పదిలో సత్తా చాటిన విద్యార్థులను సత్కరిస్తున్న హెచ్‌ఎం కనకేశ్వరరావు, ఉపాధ్యాయులు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులను మంగళవారం ఘనంగా సత్కరించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించిన దూడ రఘు (588)తో మండల స్థాయిలో రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన కూండ్రపు చాందిని(572), కురం లహరి (563), సిద్ధినాతి పద్మజ(560), గండి సాయి స్రవంతి(548), ఎండపల్లి దీప్తి(546)లను ప్రధానోపాధ్యాయుడు పందిరి కనకేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విక్టోరియా ఫ్రాన్సిస్, బి.రమేష్‌బాబు, బి.అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చి స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పాలతో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బొర్రమాంబ జాతర



ప్రత్యేక అలంకరణలో బొర్రమాంబ అమ్మవారు

అగనంపూడి: అగనంపూడి పరిసర ఎనిమిది గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం బొర్రమాంబ అమ్మవారి జాతరను మంగళవారం కనులపండువగా జరిపించారు. వేలాది మంది భక్తులు తెల్లవారుజామునే అమ్మవారి వనం వద్దకు చేరుకొని విశేష పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో పాటు చీర సారె సమర్పించారు. పండగ సందర్భంగా అమ్మవారి వనం నుంచి గ్రామం వరకు రోడ్లన్నీ విద్యుద్దీపాల వెలుగులతో నిండిపోయాయి. ప్రతీ ఇల్లు బంధువుల, స్నేహితుల రాకతో కళకళలాడుతూ పండగ వాతావరణం కనిపించింది. సాయంత్రం అమ్మవారిని భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వనం ఆవరణలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



ప్రత్యేక తరగతుల్లో బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు



సబ్బవరం కేజీబీవీ

బాలికలు అదరగొట్టారు

- సబ్బవరం కేజీబీవీలో శతశాతం ఫలితాలు
- 'కార్పొరేట్'కు దీటుగా రాణించిన విద్యార్థులు
- 'నాడు–నేడు'తో స్పష్టమైన మార్పు
- తల్లిదండ్రుల హర్షాతిరేకాలు

పదో తరగతిలో సబ్బవరం కేజీబీవీ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా సత్తా చాటారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేసి, కార్పొరేట్‌కు ప్రాధాన్యమిస్తే .. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో కోట్లాది రూపాయలతో సకల సౌకర్యాలు కల్పించింది. అత్యున్నత ప్రమాణాలతో బోధనకు ప్రాధాన్యం ఇచ్చింది. విద్యార్థులు వాటిని వినియోగించుకుని ప్రతిభ కనబరిచారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

విద్యా సంవత్సరం వారీగా ఫలితాలు

విద్యా సంవత్సరం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం
2020-21	35	35	100
2021-22	39	39	100
2022-23	40	39	99
2023-24	38	38	100

సబ్బవరం: సబ్బవరంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో తమ సత్తా చాటారు. ప్రభుత్వం కల్పించిన వసతులు,ఉపాధ్యాయుల కృషితో శతశాతం ఫలితాలు సాధించారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను 38 మంది పరీక్షలకు హాజరు కాగా 38 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఉపకరించిన పంచతంత్ర

ప్రభుత్వం కల్పించిన వసతులతో పాటు ఉపాధ్యాయుల కృషికి విద్యార్థుల సాధన తోడవడంతో శతశాతం ఫలితాలు వచ్చాయి. సమగ్ర శిక్ష నుంచి ప్రత్యేకంగా రూపొందించిన పంచతంత్ర కార్యక్రమాన్ని కేజీబీవీలో కచ్చితంగా అమలు చేశారు. ఈ కార్యక్రమం డిసెంబర్ నుంచి అమలు కావడంతో ప్రత్యేక తరుగతులు నిర్వహించారు. ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఉన్న పట్టు తెలుసుకున్నారు. వెనకబడిన వారిపై ఫోకస్ పెట్టారు. ప్రత్యేక పరీక్షలు నిర్వహించి సిద్ధం చేయడంతో టాప్ గేర్‌లో నిలిచారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ

ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి గురించి వ్యక్తిగతంగా శ్రద్ధ వహించారు. ప్రిన్సిపాల్‌తో సహా ఉపాధ్యాయులు 6గురు చొప్పున దత్తత తీసుకున్నారు. వారి స్థాయికి తగిన విధంగా బోధన చేసి సత్ఫలితాలు సాధించారు.

సాఫ్ట్ వేర్ నా డ్రీమ్



మాది ఆరిపాక గ్రామం. నాన్న పప్పుల కోటి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి జ్యోతి గృహిణిగా ఇంటి పనులకే పరిమితమయింది. పదోతరగతిలో 520 మార్కులు సాధించాను. ఇక్కడి సౌకర్యాలు, ఉపాధ్యాయుల శ్రద్ధ నా సాధనకు తోడయ్యాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడాలన్నదే నా లక్ష్యం.

– పప్పుల సునీత, ఆరిపాక, సబ్బవరం

డాక్టర్ అవుతా



మా స్వగ్రామం పాత సబ్బవరం. నా తండ్రి సోములు కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. తల్లి లావణ్య గృహిణి. నేను 6వ తరగతిలో కేజీబీవీలో చేరాను. పదోతరగతి పరీక్షల్లో మా పాఠశాల స్థాయిలో 569 సాధించి ప్రథమ స్థానంలో.. మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాను. బాగా చదివి డాక్టర్ అవుతా.

– ఎల్. మోనిష, పాత సబ్బవరం

నాలక్ష్యం పోలీస్ జాబ్



మా స్వగ్రామం చోడవరం మండలంలోని అడ్డూరు గ్రామం. నా తండ్రి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పదోతరగతిలో 519 మార్కులు వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది. మా లాంటి వారికి కేజీబీవీలు అండగా నిలుస్తున్నాయి. ఉన్నత చదువులు చదివి పోలీస్ అధికారి కావలన్నదే నా లక్ష్యం.

– ఎస్. కృష్ణవేణి, అడ్డూరు ,చోడవరం

కలెక్టర్ కావాలన్నదే లక్ష్యం



మాది గొర్లివానిపాలెం. తండ్రి అచ్చెంనాయుడు కూలిపనులు చేస్తారు. తల్లి లక్ష్మి ఇంటి పనులతో పాటు తండ్రికి సహాయ సహకారాలు అందిస్తుంది. పదోతగతిలో 538 మార్కులు సాధించాను. పాఠశాల స్థాయిలో రెండో స్థానంలో నిలిచాను.అందుకు మా ఉపాధ్యాయులు ఎంతో కృషి చేసారు. ఉన్నత చదువులు చదివి కలెక్టర్ కావాలన్నదే నా లక్ష్యం.

– టి. పూజిత, గొర్లివానిపాలెం,సబ్బవరం

వైద్యురాలిగా సేవలందిస్తా..



మాది అంతకాపల్లి శివారు ఒమ్మువానిపాలెం గ్రామం. మా నాన్న సోంబాబు వ్యవసాయ పనులు చేస్తున్నారు. అమ్మ తల్లి వెంకట లక్ష్మి వ్యవసాయ పనుల్లో నాన్నకు సాయం చేస్తుంది. పదోతరగతి పరీక్షల్లో 523 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో మూడో స్థానంలో నిలిచాను .బాగా చదివి డాక్టర్‌గా సేవలందించాలన్నదే నా కల.

– కె .అరుణ కుమారి, ఒమ్మువానిపాలెం,సబ్బవరం

అన్నదాతకు భరోసా



వెన్నలపాలెంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



నాయుడుపాలెం రైతు భరోసా కేంద్రం



తానాం రైతు భరోసా కేంద్రం

పరవాడ: రైతు పండించిన పంటలకు తెగుళ్లు సోకితే వాటి నివారణకు అవసరమైన పురుగు మందు కావాలంటే గతంలో కిలోమీటర్లలో ఉండే పురుగు మందుల దుకాణాలకు రైతులు పరుగులు తీయాల్సి వచ్చేది. అలాంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతల కష్టాలు తీరాయి. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు నిర్మించడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులోకి తెచ్చింది. సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించింది. తద్వారా సాగును ప్రోత్సహించి అన్నదాతకు భరోసా కల్పించింది. అలాగే రైతులు పెట్టుబడి సాయం, రైతు భరోసా, పి.ఎం.కిసాన్ కోసం పేర్లు నమోదు చేయడంతో పాటు రైతులు పండించే పంటలు కల్లాల వద్దే కొనుగోలు చేయడం వంటి ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించింది. పరవాడ మండలంలో 4500 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చడానికి వీలుగా ప్రభుత్వం 11 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటి నిర్మాణానికి రూ. 2.39 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం వెన్నలపాలెం, నాయుడుపాలెం, తానాం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ

అగనంపూడి: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు అవకాశం ఉంటుందని క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ సంగీత్‌మథ్ అన్నారు. క్యాన్సర్‌పై గొన్నా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో క్యాన్సర్ కారకాలు, వాటి నివారణోపాయాల గురించి వివరించారు.

1167వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి 1167వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన కోక్‌ఓవెన్ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ పరిశ్రమల వలన దేశంలో ఆర్థికాభివృద్ధి మెరుగుపడిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. కార్మిక హక్కులు అమలు కావాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని కోరారు. కార్యకమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ అమ్మవారి జాతర



విశేష అలంకరణలో పోలమాంబ అమ్మవారు



విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న పోలమాంబ అమ్మవారి ఆలయం

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పెదవాల్తేరులోని ప్రధాన ఆలయంలో అమ్మవారిని వేలాది మంది దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ ఈవో గాయత్రి సిబ్బంది సహకారంతో చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, ఎండ తగలకుండా టెంట్‌లు వేశారు. మంచినీరు, మజ్జిగ, పాలు వంటివి పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్రాన్ని సైతం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష పర్యవేక్షించారు. ఈ నెల 14న అమ్మవారి పండగ ప్రారంభమై పుట్టబంగారం తేవడం, అమ్మవారిని ప్రధాన ఆలయం నుంచి పెదవాల్తేర్ మద్దివారి పెద్దింటికి తీసుకురావడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పండగలో భాగంగా ఘటాలు, నేలవేషాలు, పులివేషాలు, గరిడీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, రథాలు, గుర్రాల జాతరతో సందడి చేశారు. సాయంత్రం చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయానికి వెళ్లే రహదారి జనసంద్రంగా మారిపోయింది. రహదారి పక్కనే ఏర్పాటు చేసిన దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేస్తూ చిన్నారులు సందడి చేశారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- 98వ వార్డు వాంబే కాలనీలో అదీప్‌రాజ్ ఎన్నికల ప్రచారం



వాంబే కాలనీలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్



ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు నమస్కారం చేస్తున్న అదీప్‌రాజ్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వాంబే కాలనీ నివాసితులు

సింహాచలం: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని జీవీఎంసీ 98వవార్డు వాంబేకాలనీలో మంగళవారం రాత్రి అదీప్‌రాజ్ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీచేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును, ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేళ్ల పాలించారన్నారు. కులమతాలు, రాజకీయ పార్టీలు, వర్గాలు చూడకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందించిన జగనన్నకు అంతా అండగా నిలవాలని కోరారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు.

టీడీపీవి మోసపూరిత మాటలు

టీడీపీ హయాంలో ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేసిన టీడీపీ మళ్లీ కూటమి పేరుతో ప్రజల్లోకి వస్తుందన్నారు. ఎన్నికల కోసం మీ ముందుకు వస్తున్న వారికి బుద్ధి చెప్పాలని అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తుకోసం, పేద ప్రజల అభ్యున్నతికోసం ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, పార్టీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి, నడింపల్లి రామరాజు, కె.జగదీష్, శంకర్, సంతోష్, సూరిశెట్టి సూరిబాబు, వాంబేకాలనీ నివాసితులు ధనాల శ్రీనివాసరావు, బలిరెడ్డి పైడిరాజు, జానకీరామ్, సంతు, నీలం తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో అన్ని కుటుంబాల్లో వెలుగు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామునాయుడు



పరవాడ: రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసిన వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని త్వరలో జరగనున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు అన్నారు. పరవాడలో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన నవరత్నాల పథకాలతో ప్రతీ ఇంటికి అనేక సంక్షేమ పథకాల ద్వారా న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే దక్కుతుందన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బూడి ముత్యాలనాయుడులను ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు.

సంక్షేమ పథకాల ద్వారా మేలు

పరవాడలో చేయూత పథకం ద్వారా 403 మందికి రూ.2.91 కోట్లు అందించిందని చెప్పారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 117 గ్రూపులకు రూ.67 లక్షలు, అమ్మ ఒడి పథకం కింద 698 మందికి రూ.3.35 కోట్లు, వాహన మిత్ర ద్వారా 57 మందికి రూ.24 లక్షలు, రైతు భరోసా కింద 702 మందికి రూ.4,32 కోట్లు, జగనన్న ఇళ్ల పథకంలో 239 మందికి రూ.4.30 కోట్ల వ్యయంతో సొంతింటి కల నెరవేర్చారని చెప్పారు. వైఎస్సార్ పింఛన్ పథకంలో గ్రామంలో 812 మందికి నెలకు రూ.3 వేల పింఛన్ అమలు చేస్తున్నారని చెప్పారు. పరవాడలో వైఎస్సార్‌సీపీ గతం కంటే నేడు బలం పుంజుకుందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం పార్టీకి వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయిన నాయకుల వల్ల ఎలాంటి నష్టం లేదన్నారు. ప్రజలంతా సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటారని. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడడం తథ్యమని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామునాయుడు అన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అందరికీ మేలు

- ఫ్యాన్ గుర్తుపై ఓటేయండి
- వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఇన్‌చార్జి అజయ్‌రాజ్



93వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అజయ్‌రాజ్

సింహాచలం: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ మేలు జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ అన్నారు. 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురం, పల్లి నారాయణపురం, అంజనాద్రికాలనీలో మంగళవారం సాయంత్రం అజయ్‌రాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎనికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యేగా అదీప్‌రాజ్‌ను, అనకాపల్లి ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 93వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ, నాయకులు దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, బి.వెంకటేష్, రమేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతకు బాండ్ అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి



ఈవో శ్రీనివాసమూర్తికి చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం పలువురు దాతలు విరాళాలు ఇచ్చారు. సంబంధిత నగదును దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తికి అందజేశారు. నగరంలోని ఆర్‌ఆర్ వెంకటా పురానికి చెందిన సత్తెనపల్లి మురళీకృష్ణ మూర్తి లక్ష 11వేల 116 రూపాయలు, పెద గంట్యాడ ప్రాంతానికి చెందిన వి. రామన్, వి. నరసింహం రూ. లక్ష ఇచ్చారు. దేవస్థానం తరపున దాతలకు బాండ్ల ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో పి.నరసింగరావు, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

గణితంపై ఆసక్తి పెంచుకోవాలి

మద్దిలపాలెం : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గణితం ఎంతగానో దోహదపడుతుందని, దానిపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.